www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 11 మే 2025 5 పశ్చిమ గోదావరి

మట్టి ట్రాక్టర్ల నిలుపుదల

ఉండి : మండలంలోని మహదేవపట్నం గ్రామం రామచంద్రపురంలో ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులో మట్టి తవ్వి ప్రైవేటు భూములను పూడుస్తున్న సుంకర శివ(నాగ సత్యుడు), సుంకర శ్రీనుకు చెందిన ట్రాక్టర్లను నిలుపుదల చేయించినట్లు గ్రామ రెవెన్యూ అధికారి చిన్నారావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా చెరువులోని మట్టిని తీసుకువెళ్లి ప్రైవేట్ స్థలాన్ని పూడుస్తున్నారని, ట్రాక్టర్లు అతివేగంతో తిరుగుతూ రోడ్డుపై మట్టి పడి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటూ తమకు ఫిర్యాదు చేశారని, ఆమేరకు సదరు వ్యక్తుల ట్రాక్టర్లను నిలుపుదల చేయడం జరిగిందని వారన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా మట్టి తోలకాలు జరిపిన వారిపై సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలియజేశారు. చెరువులు బాగు చేసుకునే వ్యక్తులు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని, చెరువులోని వ్యర్థాలను పంట కాలువల్లో వదిలితే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని చిన్నారావు తెలిపారు.

కోకో రైతుకు వెన్నుపోటు..!

- సిండికేట్‌గా మారిన కంపెనీలు
- ధర కిలో రూ.370కు తగ్గించేసి దోపిడీ
- అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో ధర రూ.700కుపైనే
- చేతులెత్తేసిన ప్రభుత్వం, ఉద్యాన శాఖ
- ఆచరణకు నోచని వ్యవసాయ శాఖా మంత్రి ప్రకటన
- తీవ్రంగా నష్టపోతున్న కోకో రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోకో రైతులకు ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది. కోకో రైతులకు అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధర కల్పించేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన మాటలన్నీ ఒట్టి మాటలుగానే మిగిలిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో ధర రూ.700కుపైగా ఉన్నప్పటికీ కంపెనీలన్నీ సిండికేట్‌గా మారి కిలో కోకోగింజలను రూ.370కు తగ్గించేసి కొనుగోలు చేయడంతో కోకో రైతులు తీవ్ర నష్టాలను మూటగట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం తమను నమ్మించి మోసం చేసిందని, ఉద్యానవనశాఖ, జిల్లా ఉన్నతాధికారులు నట్టేట ముంచేశారని కోకో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 75 వేల ఎకరాల్లో కోకో సాగవుతుండగా, జిల్లాలో అత్యధికంగా 33 వేల ఎకరాల్లో రైతులు కోకో సాగు చేస్తున్నారు. కొన్నిచోట్ల కొబ్బరిలో అంతరపంటగా కోకో ఉండగా, మరికొన్నిచోట్ల కోకో సాగును ప్రత్యేకంగా సాగు చేస్తున్నారు. కోకోను సాగు చేసేదంతా అత్యధికంగా కౌలురైతులే. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షా పది వేల వరకూ ఏడాదికి కౌలు చెల్లిస్తూ కౌలు రైతులు కోకో సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.60 వేలు వరకూ పెట్టుబడి ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. సరాసరిన మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో రైతులకు ధర చెల్లించాల్సి ఉంటుంది. కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి ధరను తగ్గించేసి రైతులను దోపిడీ చేస్తున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌కు

అనుగుణంగా ధర కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా కోకో రైతులు గడిచిన రెండు నెలలుగా పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మార్చి 17న అమరావతిలో ఉద్యాన శాఖ డైరెక్టర్ కోకో రైతులు, కంపెనీలతో చర్చలు జరిపారు. తర్వాత ఏప్రిల్‌లో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మరోసారి రైతులు, కంపెనీలతో చర్చలు జరిపారు. కిలో ధర రూ.550 వరకూ కొనుగోలు చేస్తామని కంపెనీలు చెప్పాయి. పాత, కొత్త గింజలను 3:1 నిష్పత్తిలో కొనుగోలు చేసేలా నిర్ణయించారు. తర్వాత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కంపెనీలు సిండికేట్‌గా తయారై రైతులను తీవ్రంగా వంచిస్తున్న పరిస్థితి నెలకొంది. జిల్లాలోని ఉద్యానశాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు సైతం కోకో రైతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో కంపెనీలు మరింత రెచ్చిపోయి ధర అమాంతంగా తగ్గించేసి రైతులను దెబ్బతీస్తున్న పరిస్థితి నెలకొంది.

కిలో ధర రూ.370కు ధమాల్

కోకో గింజల ధర ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో రూ.700కుపైగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కంపెనీలు శనివారం కోకో గింజలు కిలో రూ.370కు తగ్గించేశాయి. మరింత తగ్గిపోతుందని రైతులను బెదిరించి అడ్డగోలుగా కొనుగోలు చేసిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కిలో రూ.370కు విక్రయించడంతో కనీసం కౌలు ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందంటూ రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. డిసెంబర్ నుంచి మే నెలాఖరు వరకూ కోకో సీజన్ ఉంటుంది. పంట వచ్చిన తరుణంలో కంపెనీలన్నీ సిండికేట్‌గా మారిపోయి ధర తగ్గించేసిన పరిస్థితి ఏర్పడింది. కంపెనీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా అడిగే నాథుడే లేకుండాపోయాడు. ప్రభుత్వం కోకో రైతులకు న్యాయం చేస్తామని మాటిచ్చి వెన్నుపోటు పొడిచిందని కోకో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

గత్యంతరం లేక కిలో రూ.370కే విక్రయించాను

తాణింకి శ్రీను, కోకో కౌలురైతు, ద్వారకాతిరుమల మండలం

మూడున్నర ఎకరాల్లో కౌలుకు తీసుకుని కోకో సాగు చేశాను. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధర పెరుగుతుందని ఆశించాం. శనివారం ధర కిలో రూ.370కి తగ్గించేశారు. మరింత తగ్గే అవకాశం ఉందని చెప్పడంతో ఐదు క్వింటాళ్ల గింజలను కిలో రూ.370కు విక్రయించేశాను. దీంతో తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి ఏర్పడింది. మంత్రులతో చర్చలు జరగడంతో ధర పెరుగుతుందని ఆశించినా జరగలేదు.

టన్నున్నర గింజలు అలానే ఉన్నాయి

జి.సాయిబాబు, కౌలురైతు, తడికలపూడి

20 ఎకరాలను కౌలుకు తీసుకుని కోకో సాగు చేశాను. ఎకరాకు రూ.లక్షా పదివేలు చెల్లించేలా కౌలుకు తీసుకున్నాం. డిసెంబర్ నుంచి మే నెల వరకూ ముమ్మరంగా కోకో సీజన్ ఉంటుంది. ధర పెరుగుతుందని టన్నున్నర గింజలు ఉంచాం. ప్రస్తుతం ధర రూ.400 లోపుకు తగ్గిపోయింది. తక్కువ ధరకు అమ్మితే తీవ్రంగా నష్టపోతాం. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వమే కోకో రైతులను ఆదుకోవాలి.

రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యాన శాఖ పట్టించుకోలేదు

కె.శ్రీనివాస్, రైతుసంఘం జిల్లాకార్యదర్శి

వ్యవసాయ మంత్రి సమక్షంలో చర్చలు జరిగాయి. కంపెనీలతో మాట్లాడి ధర నిర్ణయిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరల నిర్ణయంపై ప్రకటన చేయలేదు. ఉద్యాన శాఖ పట్టించుకోలేదు. కంపెనీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు ఆవేదన చెందుతున్నా ప్రభుత్వం, అధికారుల్లో చలనం లేదు. ప్రభుత్వం స్పందించే వరకూ పోరాటం ఆగదు.

పనుల తీరు, ఆలస్యంపై మంత్రి ఆగ్రహం

ప్రజాశక్తి - పాలకొల్లు



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లులో వివిధ అభివృద్ధి పనులు సరిగా జరగడం లేదని, ఇదేం తీరు అంటూ మంత్రి నిమ్మల రామానాయుడు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో అభివృద్ధి చేస్తున్న అంబేద్కర్ భవనం, గౌడ శెట్టిబలిజ భవనం, ఎన్‌టిఆర్ కళాభవన్, రామగుండం పార్క్, అబ్దుల్ కలాం పార్కులను మంత్రి శనివారం పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ హాల్లో సమీక్ష నిర్వహించారు. పార్కులకు ప్రజలు ఆహ్లాదం కోసం వస్తారని, అయితే ఇష్టానుసారంగా చెట్లు, బొమ్మలకు ఆర్టిఫిషియల్ రంగులు వేయడాన్ని మంత్రి తప్పుబట్టారు. దీనికి వాటిని పర్యవేక్షిస్తున్న కమిషనర్, మున్సిపల్ ఇంజినీర్, ఎఇలదే బాధ్యత అని చెప్పారు. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగమవుతుందన్నారు. పనులు ఆలస్యంగా జరగడానికి అధికారులదే బాధ్యతని అన్నారు. మరోసారి ఇలా జరిగితే అధికారులకు మెమోలు తప్పనిసరిగా ఇస్తామని హెచ్చరించారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఇంజినీర్ రాజకుమార్, పంచాయతీరాజ్ డిఇఇ రామస్వామి, కూటమి నేతలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి

నూక శాతం పేరుతో మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచి పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకుండా ప్రభుత్వం టార్గెట్లు పెట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళు ఇంకా ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. అనేక మండలాల్లో మిల్లర్లు టార్గెట్ అయిపోయిందని ధాన్యం కొనుగోలు చేయడం లేదని పేర్కొన్నారు. రైతుసేవా కేంద్రంలో టార్గెట్ ఉండటంతో రైతులు ధాన్యం పడుతున్నారని, తీరా మిల్లుకు వెళ్లాక టార్గెట్ లేదని, తాము ధాన్యం దింపుకోబోమని చెబుతున్నారని రైతులు వాపోతున్నారని తెలిపారు. మరికొంతమంది మిల్లర్లు 1156 రకం ధాన్యం కొనుగోలు చేయబోమని, ఒకవేళ కొనుగోలు చేస్తే ముక్కైపోతుందని, రెండు కేజీల నుండి నాలుగు కేజీల ధాన్యంగాని, సొమ్ము గాని చెల్లించాలంటున్నారని తెలిపారు. కొంతమంది మిల్లర్లు ప్రతి సార బస్తాకు ధాన్యం తీసుకుంటున్నారని కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. టార్గెట్ సమస్యపై పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారులు, జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. వెంటనే టార్గెట్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని, నూక పేరుతో మిల్లర్ల దోపిడీ అరికట్టాలని డిమాండ్ చేశారు.

పౌరులు సిద్ధంగా ఉండాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

యుద్ధాన్ని ఎవరూ కోరుకోవడం లేదని, అనివార్యమైతే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తగిన అవగాహనతో పౌరులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో శనివారం మినిస్టరీ ఆఫ్ సివిల్ డిఫెన్స్ ఇన్ ఇండియా రూపొందించిన జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తయారు చేసిన 'యుద్ధం మాకొద్దు.. అనివార్యమైతే ఎదుర్కొనేందుకు మేము సిద్ధం' అనే పుస్తకాన్ని శనివారం కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖాధికారి డాక్టర్ ఆర్.కుమరేశ్వరన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ యుద్ధాన్ని ఎవరూ కోరుకోరని, యుద్ధం వల్ల ప్రజలను, ఆర్థిక వనరులను పెద్ద మొత్తంలో కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. ఇది ఏ దేశానికైనా తీరని లోటని అన్నారు. ఏ దేశమైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలనే కోరుకుంటుందని, యుద్ధ వాతావరణం నెలకొన్న దేశాలే కాకుండా ఇతర దేశాలు కూడా ఇటువంటి సందేశాలను అందజేస్తాయని అన్నారు. మాకు యుద్ధమే కావాలి అని మొండి వైఖరితో ముందుకొస్తే పొరుగు దేశాన్ని ఎదుర్కోవడానికి త్రివిధ దళాలతోపాటు పౌరులు కూడా సైనికులుగా మారి ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. పౌరులకు అవగాహన కల్పించేందుకు ముందస్తు జాగ్రత్తల సమాచారాన్ని పుస్తక రూపంలో ముద్రించడం జరిగిందన్నారు. ఈ బుక్‌లెట్ సమాచారం అన్ని స్థాయిల్లోని జిల్లా, డివిజన్, మండల అధికారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

20న సమ్మెను కార్మికవర్గం జయప్రదం చేయాలి

పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి

ఈ నెల 20న లేబర్ కోడ్‌ల రద్దు కోసం చేపట్టిన జాతీయ సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు అధ్యక్షతన శనివారం జరిగిన జాతీయ కార్మిక సంఘాల జిల్లా సదస్సులో ఆయన ముఖ్యఅతిగా పాల్గొని మాట్లాడారు. ఎనిమిది గంటల పనిని మార్పు చేసి 14 గంటలు పని చేయాలంటున్న కార్పొరేట్ శక్తుల వాదనను తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చట్టాలను మార్చుకుంటూ వెళ్లిపోతుందని, పాత బానిస విధానాన్ని అమలు చేయాలని, రాజ్యాంగాన్ని నాశనం చేయాలని చూస్తుందని విమర్శించారు. రిటైరైన ఉద్యోగులకు పెన్షన్ కూడా హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల మార్పులు చేసిందని వివరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ వందేళ్ల భారతదేశ చరిత్రలో జాతీయ నాయకుల పోరాటాలు, అనేకమంది నాయకుల త్యాగాలు, కార్మిక వర్గ ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న 44 చట్టాలను మోడీ మార్పులు చేసి లేబర్ కోడ్‌లు తీసుకురావడాన్ని ఖండించారు. కొత్తగా వచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల యాజమాన్యాలకు పూర్తిగా లాభదాయకరమని, కార్మికులకు ఎటువంటి ప్రయోజనమూ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశమంతా కరోనా విపత్తుతో అల్లాడుతుంటే పార్లమెంట్లో బలం ఉందని కార్మిక చట్టాలు, న్యాయ చట్టాలు సవరణ, రైతాంగ నల్ల చట్టాలు, మోటార్ ట్రాన్స్‌పోర్టు చట్టాల సవరణ, విద్యుత్ చట్టం వంటి అనేక ప్రజావ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఆమోదించేసిందన్నారు. ఎఐటియుసి జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ చట్టాల మార్పు దేశ పారిశ్రామిక అభివృద్ధికి విఘాతం కలిగిస్తుందని, బ్రిటీష్ వారిని ఎదిరించి సాధించిన కార్మిక చట్టాలను మార్చడం బిజెపికి తగదని విమర్శించారు. ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు రామ్మోహన్ మాట్లాడుతూ అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని అనేక ఏళ్ల నుంచి పోరాడుతున్నా ప్రభుత్వం చట్టం చేయలేదని, ఇప్పుడు ఉన్న చట్టాలనే మార్పు చేయాలని ప్రయత్నం అందరికీ చాలా నష్టదాయకమని తెలిపారు. యుటియుసి నాయకులు డి.శ్రీనివాస్‌రాజు, ఎఐసిసిటియు నాయకులు మహంకాళి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లేశ్వరరావు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి సంపూర్ణ మద్దతు ప్రకటిద్దాం

ఉగ్రవాదాన్ని తుద ముట్టించడమే మన లక్ష్యం

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - భీమవరం

ర్యాలీ అగ్రభాగాన కలెక్టర్, ఎంఎల్‌సి

భారత సైన్యానికి సంపూర్ణ మద్దతు ప్రకటిద్దామని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. జువ్వలపాలెం రోడ్డులోని అడ్డ వంతెన మూర్తి రాజు విగ్రహం నుండి టాటా విగ్రహం వరకు శనివారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. రఘురామకృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, జిల్లా అధికారులు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా ఉగ్రవాదులు సామాన్య ప్రజలను, మిలటరీ అధికారులను పొట్టన పెట్టుకున్నారని, ఎంతో శాంతియుతంగా ఉన్న దాన్ని అలుసుగా తీసుకొని ఇటీవల జరిగిన పెహల్గాం దాడిలో మతం పేరుతో 22 మంది పర్యాటకులను విచక్షణారహితంగా కాల్చి చంపారన్నారు. యావత్ ప్రపంచం మనకు మద్దతుగా నిలిచిందన్నారు. మనకు యుద్ధం ముఖ్యం కాదని సమస్యను శాంతియుతంగా పరిష్కరించడమే మన ఉద్దేశం అన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మనమందరం భారతీయులం, భారతదేశంపై ఎటువంటి దాడులు జరిగిన ఉపేక్షించేది లేదని అన్నారు. ఎంఎల్‌ఎ రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్నో రకాలుగా ఇబ్బంది పెడుతున్న పాకిస్తాన్ తీవ్రవాదాన్ని అంతమొందించాలని, ఇందుకు భారత ప్రధాని నరేంద్ర మోడీకి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ ర్యాలీలో అడిషనల్ ఎస్‌పి వి.భీమరావు, ఎక్సైజ్, అగ్నిమాపక శాఖ, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

20న గ్రామీణ బంద్

ఉపాధి కూలీలంతా పాల్గొనాలి

ప్రజాశక్తి - ఇరగవరం

మాట్లాడుతున్న వ్యకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌లో ఉపాధి కూలీలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి కోరారు. రాపాక గ్రామంలో పని చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం 20న దేశవ్యాప్త సమ్మెతోపాటు చేపట్టిన గ్రామీణ బంద్ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎపి వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సత్యనారాయణ, మునిస్వామి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పని లేని సమయంలో పని కల్పించి పట్టెడన్నం పెడుతూ వెన్నుదన్నుగా ఉన్న ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ ఊపిరి తీయాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కులమతాలకు అతీతంగా కూలీలందరూ ఐకమత్యంతో ఉపాధి హామీని పరిరక్షించుకోవాలని వారు కోరారు. పని ప్రదేశంలో చనిపోయిన ఉపాధి కూలీలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రోజు కూలి రూ.600 ఇవ్వాలని, పని అడిగిన ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని, పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వి.లక్ష్మీదుర్గ, కె.వెంకటరమణ, దాయం కృపాలత, పితాని లక్ష్మి, వీరవల్లి కుమారి, పితాని మందులు, ఇంజే సత్యవతి, జి.ఆశభవాని, వీరవల్లి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రమాదాలు అలా..!

రోడ్లన్నీ మరమ్మతులు చేసి ప్రయాణం సాఫీగా సాగేలా అభివృద్ధి చేస్తున్నాం.. ఇదీ కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం చెబుతున్న మాటలు. అయితే జాతీయ రహదారి నుంచి పంచాయతీరాజ్ రోడ్ల వరకూ ఇంజినీరింగ్ లోపాల వల్ల చోటుచేసుకుంటున్న ప్రమాదాలపై ఎవరూ దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైసిపి ప్రభుత్వ హయాంలో రోడ్ల అభివృద్ధి మాట అటుంచి నిర్వహణను సైతం గాలికొదిలేయడంతో జనం నానావస్థలు పడ్డారు. ఎన్నికల ముందు రోడ్లు వేస్తున్నట్లు ఆ ప్రభుత్వం హడావుడి చేసినా ఆ పనులు చాలా పరిమితంగానే సాగాయి. కూటమి అధికారంలోకి రాగానే సంక్రాంతిలోపు రోడ్లన్నింటికీ మరమ్మతులు నిర్వహించారు. గోతులు పూడ్చటంతో వాహనదారుల కష్టాలు కొంత తొలగాయి. దీంతో జనం కొంత ఉపశమనం పొందారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అయితే తాజాగా జాతీయ రహదారులు, ఆర్అండ్‌బి రోడ్లపై ప్రమాదాలు పెరగడంతో మరోసారి రోడ్ల పనులపై చర్చ తెరపైకి వచ్చింది. జాతీయ రహదారిపై ఇటీవల గుండుగొలను, కలపర్రు టోల్‌ప్లాజా సమీపంలో కార్లు డివైడర్ దాటి దూసుకొచ్చి ఎదురుగా వస్తున్న కార్లను ఢీకొనడం గగుర్పాటు కల్గించింది. ఉంగుటూరు మండలం బాదంపూడి శివార్లలో జాతీయ రహదారికి సమీపంలో లారీ ఆర్‌టిసి బస్సును ఢీకొన్న తీరు అందరినీ భయభ్రాంతులకు గురిచేసింది. ఆర్‌టిసి డ్రైవర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పిందనే చెప్పొచ్చు. ఇక్కడ కూడా ఇంజినీరింగ్ లోపాల వల్లే ప్రమాదం జరిగిందని చెప్పొచ్చు. ఇటీవల జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను మంత్రి పార్థసారథి, జిల్లా అధికారులు పరిశీలించి పలు చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు. సమావేశ నిర్ణయాలు చూస్తే అద్భుతం, చేతలే తిరోగమనం అన్నట్లు ఉంది వాస్తవ పరిస్థితి. ఇప్పటికీ పెట్రోలింగ్ వాహనాలు జాతీయ రహదారి ప్రధాన కూడళ్ల వద్దో, లేక ఫ్లయ్ ఓవర్ల కింద నిలిపి ఉంచడమే తప్ప పెట్రోలింగ్ పెద్దగా నిర్వహించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికీ



జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేస్తున్న పరిస్థితి ఉంటోంది. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అలాగే జాతీయ రహదారిపై అపసవ్య దిశలో వాహనాలు ప్రయాణించడం అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. కైకరం, పూళ్ల తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నా పెట్రోలింగ్ పోలీసులు పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇదే పరిస్థితి ఇటు కొయ్యలగూడెం-జీలుగుమిల్లి, గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారులపైనా పెట్రోలింగ్ అధ్వానంగా ఉందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ఇక ఇంజినీరింగ్ లోపాలు పరిశీలిస్తే ఏలూరు-గుండుగొలను వరకూ చూసినా ఫ్లయ్ ఓవర్ల నిర్మాణం సమయంలోనే కుంగిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. వాహనాల రాకపోకలు సాగుతున్న తరుణంలో ఫ్లయ్ ఓవర్ల పైకి వెళ్లేసరికి రోడ్డు ఎగుడు, దిగుడుగా ఉండటంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. వాటిని శాశ్వత ప్రాతిపదికన సరి చేసే ప్రయత్నం చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక రోడ్ల నిర్వహణతోపాటు మార్జిన్ల నిర్వహణా చాలా కీలకం. ఎప్పటికప్పుడు జంగిల్ క్లియరెన్స్ చేయడంతోపాటు మార్జిన్లు సక్రమంగా ఉంటే చాలా వరకూ ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉంది. అయితే బాదంపూడి వద్ద రోడ్డు మార్జినే కానరాని పరిస్థితి ఉండటంతో లారీ బస్సుపైకి దూసుకెళ్లింది. తర్వాత మార్జిన్ కొంత సరి చేసే ప్రయత్నం తూతూమంత్రంగా చేశారు తప్ప శాశ్వత ప్రాతిపదికన ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. ఇదే పరిస్థితి తాడేపల్లిగూడెం-కోడేరు రోడ్డులోనూ కన్పిస్తోంది. ఇలా చాలా చోట్ల రోడ్లు నిర్మించేసి చేతులు దులుపుకోవడం తప్ప దానికి అనుగుణంగా మార్జిన్‌ను ఎత్తు చేయడం వంటి చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు సమీక్షలతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులు చక్కదిద్దేలా రోడ్ల అభివృద్ధికి, మార్జిన్లలో లోపాలు సరి చేయడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో అతిశయోక్తి లేదు.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

అమరుల త్యాగాలు యువతకు వివరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్

వర్ధంతి సభలో మాట్లాడుతున్న నాయకులు

పెనుమంట్ర, వీరవాసరం: అమరవీరులు సూర్యనారాయణ రాజు, పేరంటాలు ప్రజలకోసం చేసిన త్యాగాలు నేటి యువతకు వివరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. అమరవీరుడు, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు కలిదిండి సూర్యనారాయణ రాజు 75వ వర్ధంతి, గొలగాని అచ్చియ్య(పేరంటాలు) 34వ వర్ధంతి శనివారం మండలంలోని పొలమూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీరవాసరం మండలం బూదారాయుడు చెరువు వద్ద నుంచి మోటార్ సైకిల్‌పై ర్యాలీగా అమరవీరులు సూర్యనారాయణ రాజు, పేరంటాలు జోహార్లు అంటూ సభ వద్దకు చేరుకున్నారు. ముందుగా సూర్యనారాయణ రాజు స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు జుత్తుగా నరసింహామూర్తి ఆవిష్కరించారు. స్థూపంపై ఉన్న సూర్యనారాయణరాజు చిత్రపటంపై మహిళా సంఘం నాయకులు సాంబయ్యమ్మ, కె.పద్మజ, భారతి, సూర్యకుమారి నివాళులర్పించారు. పేరంటాలు చిత్రపటానికి పొలమూరు శాఖ కార్యదర్శి రాపాక ఆశీర్వాదం, లింగం సత్యనారాయణ, బాబురావు దండేసి నివాళులర్పించారు. అనంతరం స్థూపం వద్ద జరిగిన సభ కార్యక్రమానికి పెనుమంట్ర మండల కార్యదర్శి కె.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ భవిష్యత్తు సోషలిజం ఆవశ్యకత గురించి ప్రజలందరికి వివరించడానికి కమ్యూనిస్టులు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, వ్యవసాయేతర కార్మికులు, చిన్న సన్నకారు రైతులను సంఘటితం చేయడం ద్వారానే అమరవీరుల త్యాగాలకు నిజమైన నివాళి అని గోపాలన్ అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు నరసింహమూర్తి మాట్లాడుతూ అమరవీరుల ఆశయ సాధనకు మనందరం కృషిచేయడం ద్వారానే వారికి నిజమైన నివాళి అని తెలిపారు. అనంతరం లింగం సత్యనారాయణ, చింతపల్లి సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ సభ్యులు చింతపల్లి తిరుమలరావు, కె.ప్రసాద్, పిల్లి రాజారావు, పి.సూర్యనారాయణ, పి.సత్యనారాయణ, తూటే సురేష్, పిల్లి శ్రీనివాస్, నాగేశ్వరరావు, మారియా నాయుడు, కొప్పిశెట్టి నారాయణమూర్తి, గంటి ఆంజనేయులు, పెచ్చెట్టి ప్రసాద్, శ్రీరామమూర్తి, దొంగ నాగేశ్వరరావు, కె.ప్రమోద్, పి.లక్ష్మీనారాయణ, మంగ సూర్యనారాయణ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న సంత మార్కెట్

నిర్మానుష్యంగా పాలకొల్లు వారపు సంత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఉద యం ఎండ, మబ్బులు దోబూచులాడాయి. అయితే మధ్యాహ్నం నుంచి ఎండతీవ్రత ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో పాలకొల్లు పట్టణంలోని శనివారపు సంత కొనుగోలుదారులు లేక నిర్మానుష్యంగా ఉంది. గత కొన్ని వారాలుగా ఇదే పరిస్థితి ఉంది. కొందరు వ్యాపారులు కూడా ఎండకు భయపడి దుకాణాలు వేయడం మానేశారు. వేసిన దుకాణాల్లో కొనుగోలుదారులు లేక వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. వారపు సంతలో రేట్లు అనుకూలంగా ఉన్నా ఎండకు భయపడి మధ్యతరగతి ప్రజలు సంతకు రావడం మానేసారు.

రోడ్డు పనులు తెలుపుతూ ఆర్అండ్బి బ్యానర్

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పెనుమంట్ర

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

మార్టేరు-పెనుగొండ రోడ్డు మార్గంలో నెగ్గిపూడి వద్ద జరుగుతున్న కల్వర్ట్ నిర్మాణపు పనుల నిమిత్తం రోడ్డు మూసివేస్తున్నట్టు ఆర్అండ్బి అధికారులు బ్యానర్ని నెలకొల్పారు. ఈ మేరకు ఆర్అండ్బి ఎఇ ప్రసాద్ మాట్లాడుతూ మార్టేరు సెంటర్లోను, పెనుగొండ వంతెన రోడ్డు సమీపంలోని బస్ స్టాండ్ వద్ద, కాలేజీ వంతెన వద్ద దారి మళ్లింపు సమాచారం తెలిపే బ్యానర్లు పెట్టినట్టు పేర్కొన్నారు. నెగ్గిపూడి వద్ద నిర్మాణం జరుగుతున్న కల్వర్ట్ వద్ద ద్విచక్ర వాహనాల రాకపోకలు సాగించడం కోసం కాల్వ పైన మట్టితో ర్యాంపు నిర్మాణం చేసామని, ఎవరికీ ఇబ్బంది ఉండదని అన్నారు. జూన్ 10 నాటికి నెగ్గిపూడి కల్వర్ట్ నిర్మాణం, పెనుగొండ పెద్ద వంతెన రిపేర్ పనులు పూర్తిచేసి పూర్తిగా అన్ని వాహనాలు తిరగడానికి అందుబాటులోకి తీసుకొని వస్తామని అన్నారు.

వీర సైనికుల త్యాగానికి సంఘటితం కావాలి

వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిశోర్ కుమార్

ప్రజాశక్తి - ఆచంట

సరిహద్దుల్లో అసువులు బాసిన వీర సైనికుల త్యాగానికి ప్రతిఒక్కరూ సంఘటితం కావాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిశోర్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉగ్రవాద మూకలపై భారత సైన్యం వీరోచిత పోరాటం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి పార్టీలు, వర్గాలు, ప్రదేశాలు అన్ని వదిలేసి ఒక్క భారతీయతే లక్ష్యంగా ప్రతి ఒక్క పౌరుడు నిలబడాలని పిలుపునిచ్చారు. సరిహద్దుల్లో భారత సైన్యం ప్రాణాలొడ్డి పోరాడుతుందన్నారు. ఇప్పటికే ఇద్దరు వీర జవానులు వీర మరణం పొందారన్నారు. వారి త్యాగానికి గుర్తుగా అందరం సంఘటితం కావాలన్నారు. పార్టీలకతీతంగా భారత ప్రభుత్వానికి మద్దతుగా నిలబడదామన్నారు. భారతీయతే మన ఎజెండా అని అన్నారు. ప్రతి ఒక్కరి భావనలో భారతదేశ మువ్వన్నెల జెండాను తలుచుకుంటూ తరతరాల ఉగ్రవాద ముష్కరులపై జై భారతమాత అంటూ ఏకకంఠంతో నినదిద్దాం అని పిలుపునిచ్చారు.

నేడు సమతా ట్రస్ట్ పురస్కారాల వేడుక

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పొలమూరు గ్రామంలో సమతా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం సాయంత్రం ఇటీవల టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు తెచ్చుకున్న 11 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామని ట్రస్ట్ ఫౌండర్, అధ్యక్షులు తాడిపర్తి సంపత్ రావు ఇక్కడ తెలిపారు. ఈ ప్రతిభా పురస్కార కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా శాఖ జాయింట్ డైరెక్టర్ దిద్దే శ్రీనివాసరావు, రాజమండ్రి ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య గోడి సుధాకర్, పొలమూరు సర్పంచి కాకర రాజేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు చింతపల్లి రామకృష్ణ, డాక్టర్ ఉన్నమట్ల మునిబాబు పాల్గొంటారని ఆయన తెలిపారు.

వైసిపి మహిళా నేత సరిత ఔదార్యం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో కోర్టు పక్కన టీ కొట్టు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్న ఈశ్వరమ్మ, రమణమ్మలు తల్లి కూతుర్లిద్దరి టీ వ్యాపారం పెట్టుబడి లేక నిలిచిపోయింది. ఆ వ్యాపార, తల్లి కూతుర్ల ఆర్థిక పరిస్థితి గురించి ప్రముఖ అడ్వకేట్ జివి.సుబ్బారావు వైసిపి రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరితకు తెలియజేశారు. దీంతో ఆమె రూ.5 వేల ఆర్థిక సహకారం వారికి అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు, పార్టీ మున్సిపల్ విభాగం అధ్యక్షులు జోగి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, దేవ రాజేష్, వీరా మల్లికార్జునుడు, గుమ్మాపు సూర్య వరప్రసాద్, కుమారి, జ్యోతి పాల్గొన్నారు.

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక శ్రీదాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా వెబ్ డెవలపర్ కోర్సు 3 నెలలు ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాఫిక్ డిజైన్ అసోసియేట్ కోర్సులో 2 నెలల ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని ప్రిన్సిపల్ అన్నారు. ఇంటర్, డిగ్రీ పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి గలవారు 8309208484 నెంబర్ను సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాటుసారా నిర్మూలన కార్యక్రమం నవోదయం 2.0 శనివారం తాడేపల్లిగూడెం రూరల్ మండలంలోని లింగరాయుడుగూడెం గ్రామంలో నిర్వహించారు. మద్యపాన వ్యసనం - వ్యసన విముక్తికు కేర్ కమిటీచే అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాటుసారాయి, మద్యపాన సేవనం, ఆ వ్యసనంలో చిక్కుకుని అనారోగ్యం బారినపడిన వారిని గుర్తించి, ప్రభుత్వంచే నిర్వహించబడుతున్న వ్యసన విముక్తి కేంద్రంలో చేర్పించే విధంగా వారికి వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ స్వరాజ్ లక్ష్మి మాట్లాడుతూ ప్రజలందరూ మద్యపానానికి గురికాకుండా ఆరోగ్యవంతంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.దొరబాబు, హెడ్ కానిస్టేబుళ్లు విప్లవకుమార్, అనిల్ కుమార్, సిబ్బంది, గ్రామ ఉప సర్పంచి కాసాని రాంబాబు, ఎంపిటిసి వీరమల్లు వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

తణుకురూరల్ : మద్యం సేవించడం వల్ల కలిగే స్వల్పకాలిక, దీర్ఘకాలిక అనారోగ్య ప్రభావాలపై కేర్ కమిటీ(కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో స్థానిక సుధా హాస్పిటల్లో తణుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠరెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించడం వల్ల మానవ శరీరంలో వివిధ అవయవాలు గొంతు, అన్నవాహిక, కాలేయం, పెద్ద పేగులు, గుండె తదితర అవయవాలపై చూపే దుష్ప్రభావాలు, మానసిక ఆందోళన, డిప్రెషన్, అధిక రక్తపోటు తదితర లక్షణాలు మద్యపానం వల్ల కలుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సుధా హాస్పిటల్ డాక్టర్ రవిశంకర్, ఎస్ఐలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు పాల్గొన్నారు.

గోల్డ్ లోన్ అవకతవకలపై కేసు నమోదు

నరసాపురం : పట్టణంలోని ముత్తూట్ మినీ ఫైనల్స్ బ్యాంకు గోల్డ్ లోన్లో అవకతవకలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి తెలిపారు. స్టీమర్ రోడ్లో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్లో పట్టణానికి చెందిన యర్రగుంట శంకర సుబ్బారావు మేనేజర్గా పనిచేస్తున్నారు. ఈ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు పోతుల వంశీకృష్ణ, కొపనాతి సౌజన్య, రాజమిల్లి శ్రీహర్ష కలిసి బ్యాంకులో లోన్ పెట్టిన 22 రుణాలకు సంబంధించి 718 గ్రాముల బంగారం అవకతవకలు జరిగినట్లు ఫిబ్రవరి 25న జరిగిన ఆడిట్లో బ్యాంకు ఉన్నతాధికారులు గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారులు గడువు ఇవ్వగా 11 రుణాలకు సంబంధించి లావాదేవీలు సరిచేసారు. మిగిలిన 11 లావాదేవీలకు సంబంధించిన 485 గ్రాముల విలువైన బంగారంకు రూ.16,93,196 నగదు తిరిగి సంస్థకు చెల్లించలేదన్నారు. దీంతో ఆ సంస్థ రిజనల్ మేనేజర్ వేల్పూరి రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయలక్ష్మి తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కార్పొరేట్ సంస్థలను తలదన్నేలా విద్యాబోధన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

హైస్కూల్ హెచ్ఎం అనురాధ

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా వారిని మించే విధంగా ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో పది ఫలితాలలో జిల్లాలో మూడో స్థానం సాధించామని చినఅమిరం హైస్కూల్ హెచ్ఎం అనురాధ అన్నారు. పదోతరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలో తృతీయ స్థానం సాధించిన మార్గాలను ఆమె ప్రజాశక్తితో పంచుకున్నారు. నేటి పోటీ ప్రపంచంలో చదువుతోనే ఏదైనా సాధ్యమని, ముఖ్యంగా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మా విద్యార్థులను తీర్చిదిద్దాలని జూన్ నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నామన్నారు. దీంట్లో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు. ముఖ్యంగా తమ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా చెప్పాలని, ప్రతి ఒక్కరూ ఎలాగైనా మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో వారిపై ప్రత్యేక దృష్టిపెట్టి చదివించారని దీంతో జిల్లాలో తృతీయ స్థానం సాధించామన్నారు. అంతేకాకుండా పరీక్షకు 120 మంది విద్యార్థులు హాజరైతే 98 మంది పాసయ్యారని, 82 శాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపారు. ఆమోదలపల్లి శివసాయి వెంకట కార్తీక్ జిల్లా ద్వితీయ స్థానం,

జిల్లా తృతీయ స్థానం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

చినఅమిరం ప్రాథమిక ఉన్నత పాఠశాల

స్కూల్ ఫస్ట్ 589 మార్కులు సాధించగా, జి.సత్య ప్రకాష్ 572 మార్కులతో స్కూల్ తృతీయ స్థానం, డొక్కు లోకేష్ సత్య 559 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివించే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి, చదివించాలని ఆమె తల్లిదండ్రులను కోరారు.

సమాజంలో తల్లి ప్రేమ అపురూపం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఐసిడిఎస్ ఆధ్వర్యాన పలుచోట్ల మాతృ దినోత్సవం

సమాజంలో తల్లి ప్రేమ అపురూపమైనదని అంగన్వాడీ సూపర్వైజర్ కె.సూర్య కుమారి అన్నారు. విస్సాకోడేరు అంగన్వాడీ కేంద్రంలో మదర్స్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సూర్యకుమారి ఆధ్వర్యంలో చిన్నారులు కేక్ కట్ చేశారు. అలాగే చిన్నారులు వారి తల్లులకు కాళ్లు కడిగి పాదాభిషేకం చేశారు. అనంతరం సూపర్వైజర్ సూర్యకుమారి మదర్స్ డే విశిష్టత, తల్లి ప్రేమ ప్రాముఖ్యత గురించి చిన్నారులకు వివరించారు. నవ మాసాలు మోసి తల్లి పిల్లలకు జన్మనిస్తుందని, సమాజంలో తల్లిని మించిన దైవం మరొకటి లేదని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం తల్లులకు, చిన్నారులకు మంచి పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల అభివృద్ధికి, చిన్నారుల ఎదుగుదలకు తోడ్పాటును అందిస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రభుత్వమిచ్చే పౌష్టికాహారాన్ని తీసుకుని మంచి ఆరోగ్యాన్ని పొంది దృఢంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు వారి తల్లులు పాల్గొన్నారు.

36వ వార్డులో : భీమవరం పట్టణంలోని 36వ వార్డు ఆర్ఆర్ తోటలోని అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్వైజర్ కె.సరళ ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ చిన్నారులు వారి తల్లులకు ప్రతిరోజు నమస్కారం చేయాలని సూచించారు.

పాలకోడేరులో..

తల్లిదండ్రులను ప్రేమించిన వారు జీవితంలో ఎంతో అభివృద్ధి చెందుతారని ఆవిధంగా చిన్నారులు నడుచుకోవాలని పేర్కొన్నారు.

భీమవరం టౌన్ : జన్మనిచ్చిన తల్లిదండ్రులను ప్రతిఒక్కరూ గౌరవించుకోవాలని ఐసిడిఎస్ భీమవరం ప్రాజెక్టు సూపర్వైజర్ డి.అనిల్ కుమారి అన్నారు. మాతృదినోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక రాయలంలోని అంగన్వాడీ సెంటర్లో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ చిన్నారి చేత తల్లుల కాళ్లు కడిగించి తల్లుల చేత దీవెనలు అందించారు. ఈ సందర్భంగా అనిల్కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సిహెచ్.మహాలక్ష్మి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

గణపవరం : పిల్లలకు తల్లి మొదటి గురువని పిప్పర సెక్టార్ అంగన్వాడీ సూపర్వైజర్ సిహెచ్.దుర్గాభవాని అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా పిప్పర 5వ అంగన్వాడీ కేంద్రంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దుర్గాభవాని మాట్లాడుతూ పిల్లల అభివృద్ధికి తల్లిచేసే కృషిని వివరించారు. పిల్లలకు తల్లి మొదటి గురువని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, పద్మావతి, అనిత, స్కూల్ పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో శనివారం తల్లికి వందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు చిన్నారులు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు తల్లి ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించి తల్లిని గౌరవించాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఉండి : ఆదివారం ప్రపంచవ్యాప్తంగా మాతృదినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న నేపథ్యంలో మండలంలోని వెలివర్రు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త శ్యామల ఆధ్వర్యంలో మాతృదినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చిన్నారులకు వారి తల్లిదండ్రులను ఏవిధంగా గౌరవించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కనిపించే దైవం తల్లితండ్రులని, వారిని ఎల్లప్పుడు గౌరవించుకుంటూ వృద్ధాప్యంలో తోడుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

ఆర్పిల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్

తణుకు : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్పై ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మెప్మా కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి సిఎంఎం డి.శివ ప్రసాద్కు డిమాండ్స్తో కూడిన సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో పనిచేస్తున్న ఆర్పిల సమస్యలు పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయకుండా వేధించడం అన్యాయమన్నారు. ఆర్ పిలకు కనీస వేతనం రూ.10 వేలు ఇస్తామని ఆచరణలో రూ.8 వేలు ఇస్తున్నారని తెలిపారు. ఆది, సోమవారం అని లేకుండా పని చేయించుకోవడం జరుగుతుందన్నారు. ఆర్ పిలపై పని ఒత్తిడి గతం కంటే ఎక్కువ పెరిగిందన్నారు. కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు అడవి నిర్మలాదేవి, టి.భారతి, వెంకటరమణ, ధనలక్ష్మి, కె.కృష్ణకుమారి, ఎస్కె.రజియా బేగం, శ్యామల పాల్గొన్నారు.



సమ్మె జయప్రదం చేయాలని నినదిస్తున్న కార్మికులు

20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం : 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక చింతపండు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్(సిఐటియు అనుబంధ సంస్థ) సర్వసభ్య సమావేశం శనివారం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నరమాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను ఈ దేశంలో ఉన్న పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చేందుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చూస్తుందని, ఈ చట్టాలను పార్లమెంట్లో ఆమోదించి, ప్రజల మీద రుద్దడానికి చూస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గాన్ని మరింత బానిసలుగా మార్చాలని చట్టాలను మారుస్తుందన్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఉన్న దేశవ్యాప్త కార్మిక సంఘాలు, గ్రామీణ ప్రాంతంలో ఉన్న రైతులు, వ్యవసాయ కార్మికులు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న లేబర్ కోడ్లు అమలైతే కార్మికులు అనేవారు బానిసత్వంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ మన దేశంలోని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందని, వీటిని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ నిలిపివేయాలని, సమాన పనికి సమాన వేతనం, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను, నరమాల కృష్ణ, తంగేటి శ్రీనివాస్, ఏలూరు వేణు, వారా సురేష్, యలమంచిలి అప్పారావు హాజరయ్యారు.

'ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం'

నరసాపురం : మండలంలోని వేములదీవి పడమర ప్రకాశరపురంలో గ్రేస్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ సంస్థ నిర్వాహకులు మైలాబత్తుల రాజేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి పొత్తూరి రామరాజు ప్రారంభించి మాట్లాడుతూ తీర ప్రాంతంలో పేద ప్రజలకు వైద్య శిబిరం ఏర్పాటు, కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ శిబిరంలో అన్ని రకాల వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, సహాయ సహకారాలు కలిగి ఉండాలని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన రాజేష్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వాతాడి ఉమామహేశ్వరరావు, నరసాపురం పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్కు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి శ్రేణులు

పెహల్గాం దాడి ఘటనకు ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత ప్రభుత్వం పాకిస్తాన్ టెర్రరిస్టులపై చేస్తున్న దాడికి మద్దతు పలుకుతూ భీమవరంలో చేస్తున్న ర్యాలీకి ఉండి నుంచి కూటమి శ్రేణులు టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కలిదిండి రామచంద్ర రాజు జన్మభూమి పార్క్ వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విశ్రాంత జవాన్, కలిసిపూడి ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ పెహల్గాం దాడి తమను కలచివేసిందని, దానికి ప్రతిదాడిగా భారత సైన్యం ప్రధాని నరేంద్ర మోడీ సూచనల మేరకు ఆపరేషన్ సింధూర్ పేరిట టెర్రరిస్టులపై చేస్తున్న దాడులకు యావత్ ప్రపంచం మద్దతు తెలుపుతుందని అన్నారు. అవసరమైతే విశ్రాంత జవానులు సైతం మళ్లీ విధుల్లోకి వస్తామని, తమ సేవలను భారత సైన్యం వినియోగించుకోవాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. భీమవరం బయలుదేరి వెళ్లిన వారిలో ఉండి డిసి వైస్ చైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, నాయకులు కాగిత బుజ్జి, ఉంగరాల నాగేశ్వరరావు, గురుగుబిల్లి వెంకట పెద్దింటిబాబు, ముగ్గళ్ల సత్యనారాయణ, గోనబోయిన భీమా రామకృష్ణ, తక్కెళ్ల నరేష్, కరిమెరక సత్య, కేసనకోటి ఉన్నారు.

ఆకివీడు : ఉండి నియోజకవర్గంలోని పెదమెర రతన్ టాటా విగ్రహం నుంచి నియోజకవర్గ ఎంఎల్ఎ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆధ్వర్యంలో చేపట్టిన సైనిక సంఘీభావ ర్యాలీకి ఆకివీడు నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. శనివారం మధ్యాహ్నం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి అధికార కూటమికి చెందిన మూడు పార్టీల సభ్యులు కలిసి వెళ్లారు. సుమారు 300 మంది కార్యకర్తలు సైనికులకు సంఘీభావం తెలిపేందుకు బయలుదేరి వెళ్లారు.

పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - పెంటపాడు

మండలంలోని ముదునూరు, ఆకుతీగపాడులో ఉపాధి కూలీలకు పనిముట్లు, పని ప్రదేశాల్లో మజ్జిగ సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయకార్మిక సంఘం, రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆకుతీగపాడు, ముదునూరు గ్రామాలలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిర్లపుల్లారెడ్డి, కె.సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు చట్టంలో 15 రోజులకే వేతనాలు ఇవ్వాల్సి ఉండగా నెలల తరబడి పెండింగ్ బకాయిలు ఉన్నాయని, తక్షణమే కూలీలకు పే స్లిప్పులిచ్చి 15 రోజులకే వేతనాలు ఇవ్వాలని, కొత్త గ్రూపులకు పనిముట్లు ఇవ్వాలని, పనిప్రదేశాలలో గంటలో మెడికల్ కిట్లు లాంటివి ఏర్పాటు చేయాలని, మురుగుకోడుల్లో పనిచేస్తున్న కూలీలకు సీసా పెంకులు, విష పురుగులు ముఖ్యంగా మురుగులో పనిచేస్తున్న కూలీలకు చర్మం దురదలులాంటివి జరుగుతున్నాయని అన్నారు. అందుకోసం పనిప్రదేశాల్లో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని వారు కోరారు. పలువురు ఉపాధి మేట్లు మాట్లాడారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

పోడూరు : వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ కూలీలు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మూడే మోజస్ పిలుపునిచ్చారు. శనివారం పోడూరు మండలం తూర్పుపాలెం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగను పంపిణీ చేసి దాహార్తిని తీర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన జరుగనున్న దేశవ్యాప్త సమ్మెలో ఉపాధిహామీ కూలీలు పాల్గొని విజయంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎ.కిషోర్, బి.అనిల్, కె.మోహన్ రావు, ఎన్.శైలజ, పి.లలిత, కె.సుజాత, టి.పుష్పరాజ్యం పాల్గొన్నారు.

మహిళలు, వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేత

తాడేపల్లిగూడెం : ప్రముఖ సోషల్ వర్కర్ మానుకొండ రూతు మెర్సి పేద ప్రజలకు స్వచ్ఛందంగా చేసిన సేవలు అభినందనీయమని కైండ్నెస్ సొసైటీ అధ్యక్షులు గట్టిం మాణిక్యాలరావు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు రొక్కాల నాగబుజ్జిలు పేర్కొన్నారు. స్థానిక టీచర్స్ కాలనీలో మానుకొండ డల్లా ఆధ్వర్యంలో రూతు మెర్సి 15వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రూత్ మెర్సి సేవలను కొనియాడారు. అనంతరం పేద మహిళలకు, వృద్ధులకు నూతన వస్త్రాలను అందజేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దైవజనులు ఎజ్రా, అవినాష్, ప్రకాష్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONBLE Ist ADDL JUNIOR CIVIL JUDGE, ELURU, W.G.Dt
I.A.No. 218/2016 in O.S.No. 231/2016

Between:
Pulavarthi Deva Raju and another ...Petitioners/Plaintiffs
And
Ventrapati Rambabu and 4 Others ...Respondents/Defendants
R5: Byvarapu Veeramma, W/o. Veeraraju, Hindu, Female, Aged 40 yrs, R/o. Kavvagunta Village, Eluru (M), W.G.Dt.

మీరు పైన తెలిపిన I.A.No. 218/2016 లోను O.S.No. 231/2016 లోను మీకు 5వ ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన Hon'ble Ist Addl Junior Civil Judge, Eluru కోర్టు వారి ఉత్తరువు ప్రకారం మీరు ది. 12-05-2025 వ సం॥రం ఉదయం గం. 10-30 ని॥లకు హాజరు కావలెను. లేని యెడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానముచేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

Tumeti Ganga Raju,
Advocate, Eluru
Cell: 63015 38896
Eluru
Dt: 09-05-2025

IN THE COURT OF THE HONBLE Ist ADDL JUNIOR CIVIL JUDGE, ELURU, W.G.Dt
O.S.No. 231/2016

Between:
Pulavarthi Deva Raju and another ...Petitioners/Plaintiffs
And
Ventrapati Rambabu and 4 Others ...Respondents/Defendants
R5: Byvarapu Veeramma, W/o. Veeraraju, Hindu, Female, Aged 40 yrs, R/o. Kavvagunta Village, Eluru (M), W.G.Dt.

మీరు పైన తెలిపిన O.S.No. 231/2016 లోను మీకు 5వ ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన Hon'ble Ist Addl Junior Civil Judge, Eluru కోర్టు వారి ఉత్తరువు ప్రకారం మీరు ది. 12-05-2025వ సం॥రం ఉదయం గం. 10-30 ని॥లకు హాజరు కావలెను. లేని యెడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానముచేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

Tumeti Ganga Raju,
Advocate, Eluru
Cell: 63015 38896
Eluru
Dt: 09-05-2025

వైసిపిలో విష సంస్కృతి : మంత్రి

యలమంచిలి: జగన్ ఐదేళ్ల పాలన విష సంస్కృతితో నడిచిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మన రైతు మన రామానాయుడు కార్యక్రమంలో యలమంచిలి మండలం మేడపాడు, అడవిపాలెం, నేరేడుమిల్లి గ్రామాల్లో శనివారం రూ. 366.55 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను ఆయన కూటమి నాయకులతో కలిసి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో జగన్ ఇసుక, లిక్కర్, గనులు, విలువైన భూములను లూటీ దోపిడీకి పాల్పడగా ఆ పార్టీ స్థానిక నాయకులు క్రికెట్ బెట్టింగ్లతో యువతను చెడు మార్గంలోకి తీసుకు వెళ్లడం, సెటిల్మెంట్లతో అక్రమార్జనకు పాల్పడ్డారన్నారు. కూటమి నాయకులు ఆరిమిల్లి రామ శ్రీనివాస్, మామిడి శెట్టి పెద్దిరాజు, ఉన్నమట్ల కపర్ది పాల్గొన్నారు.

పాస్పోర్ట్ పోయినది

వట్టూరి సురేష్ కుమార్ అను నేను పెదతాడేపల్లి గ్రామ నివాసిని. కొన్ని రోజుల క్రితం తాడేపల్లిగూడెంలో నా పాస్పోర్ట్ జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా దారిలో నా పాస్పోర్ట్ పోగొట్టుకోవడం జరిగింది. ఆ పాస్పోర్ట్ మీద వట్టూరి సురేష్ కుమార్ అని ఉంటుంది. దయచేసి ఎవరికైనా దొరికిన యెడల ఈ కింది నెంబర్ కు కాల్ చేయగలరు.

వట్టూరి సురేష్ కుమార్
S/o. ప్రభాకరరావు
పెదతాడేపల్లి
డోర్ నెం: 6-68
తాడేపల్లిగూడెం మండలం
సెల్: 90326 24865

BEFORE THE HONOURABLE MOTOR VEHICLES ACCIDENT CLAIMS TRIBUNAL NARASARAOPET (IN THE COURT OF THE HONOURABLE XIIITH ADDL. DISTRICT JUDGE, NARASARAO PET)
MVOP NO. 153/2022

Between :
శ్రీ పెరంబుదూరి లీల రంగప్రసాద్ మరియు ఇంకొకరు ..... పిటీషనర్లు
వర్సెస్
ఘంటశాల క్రీస్తురాజు మరియు ఇద్దరు రెస్పాండెంట్లు (R1) ..... రెస్పాండెంట్లు

రెస్పాండెంట్ నెం.1 : ఘంటశాల క్రీస్తురాజు S/o రాములు, R/o.డోర్ నెం.3-25, శ్రీరామ్నగర్, ఇంగిలిపాకలంక, మండవల్లి మండలం, కృష్ణాజిల్లా - 521326

పై నెంబరు కేసు నందు మీరు మొదటి రెస్పాండెంట్ అయివున్నారు. పై కోర్టువారి నుండి మీకు అనేక పర్యాయములు నోటీసులు జారీ చేసినను ఉద్దేశ్య పూర్వకంగా మీకు నోటీసులు తీసుకోనందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా మీ యొక్క నోటీసు నిమిత్తం ది. 28-5-2025 నాడు వాయిదా అయివున్నది. కావున వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు ప్రత్యక్షంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల పై కేసును మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 28-5-2025

ఇట్లు
కమ్మకల్లు సంగమేశ్వరరావు,
పిటీషనర్ తరపు న్యాయవాది,
మున్సిపల్ కార్యాలయం ఉత్తరం వైపు,
ఎన్ఆర్టి సెంటర్, చిలకలూరిపేట.
ఫోన్ : 9912281014.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రారు ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా
A.A.C.F.No. 05 of 2024

బిట్వీన్:
మార్గదర్శి చిట్ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ భీమవరం, Rep.by its ఫోర్మెన్/బ్రాంచ్ మేనేజర్ శ్రీ ఎ. మాధవరావు ...**డిస్పూటెంట్**
అండ్
బొడ్డు నిర్మలా కుమారి అండ్ ఇతరులు ...**అపోనెంట్స్**

అపోనెంట్ నెం.5: కొర్రకూటి సాయికృష్ణ, S/o. శ్రీనివాసరావు, ఆఫీసు సబార్డినేట్, O/o. ఇరిగేషన్ డిపార్ట్మెంటు, ఏలూరు, ఏలూరు జిల్లా.
R/A: ఇంటి నెం. 24B-2B, H/o. కరుణకుమార్ (అడ్వకేట్), పతెబాద్, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాలో అపోనెంట్ నెం.5 అను వార్కి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారు మీ హాజరు నిమిత్తం **ది. 27-05-2025 వ తేదీకి** వాయిదా వేసినారు. కావున ఆ రోజు **ఉదయం గం.10:30 ని॥లకు** శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై తగు ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను. లేనిచో సదరు దావా గ్రంధము మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 27-05-2025

(శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటరు వారి ఉత్తర్వుల ప్రకారము)
మార్గదర్శి చిట్ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, భీమవరం ఫోర్మెన్, భీమవరం, ప॥గో॥జిల్లా.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రారు ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా
A.A.C.F.No. 06 of 2024

బిట్వీన్:
మార్గదర్శి చిట్ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ భీమవరం, Rep.by its ఫోర్మెన్/బ్రాంచ్ మేనేజర్ శ్రీ ఎ. మాధవరావు ...**డిస్పూటెంట్**
అండ్
పొన్నగంటి జగన్ అండ్ ఇతరులు ...**అపోనెంట్స్**

అపోనెంట్ నెం.1: పొన్నగంటి జగన్, S/o. సూరిబాబు, జనరల్ ఫైనాన్స్ & శారీస్ ఆక్షనీర్, శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం, భీమవరం, ప॥గో॥జిల్లా.
R/A: డోర్ నెం.5-8-55/2, రాజుల వీధి, గ్రంధి శ్రీనివాస్ నగర్, మెంటేవారితోట, భీమవరం, ప॥గో॥జిల్లా.

అపోనెంట్ నెం.6: పురెళ్ళ బాలు, S/o. వీరన్న, డోర్ నెం. 5-8-57, రాజుల వీధి, గ్రంధి శ్రీనివాస్ నగర్, మెంటేవారితోట, భీమవరం, ప॥గో॥జిలా

పై నెంబరు దావాలో అపోనెంట్ నెం.1 మరియు 6 అను వార్కి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారు మీ హాజరు నిమిత్తం **ది. 27-05-2025 వ తేదీకి** వాయిదా వేసినారు. కావున ఆ రోజు **ఉదయం గం.10:30 ని॥లకు** శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై తగు ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను. లేనిచో సదరు దావా గ్రంధము మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 27-05-2025

(శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటరు వారి ఉత్తర్వుల ప్రకారము)
మార్గదర్శి చిట్ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, భీమవరం ఫోర్మెన్, భీమవరం, ప॥గో॥జిల్లా.